క్లుప్తంగా

వైద్యాధికారిని నియమించాలి



ఓపీ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంపీపీ

కెరమెరి: వైద్యాధికారిని వెంటనే నియమించాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. చాలా కాలంగా వైద్యాధికారి లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్, ఓపీని పరిశీలించారు. ఉన్నాధికారులు తక్షణమే స్పందించి వైద్యాధికారిని నియమించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో 'గోపాలకాల'

కౌటాల: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తాటిపల్లి గ్రామంలో గల శ్రీ సిద్ధి హనుమాన్ మందిరంలో మూడోరోజు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో గోపాలకాల నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చి వార్ధా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు నారాయణ్ పటేల్, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, కమిటీ సభ్యులు మారుతి, నితేష్, తిరుపతి, ప్రవీణ్, సునీల్, గణపతి, రవి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్ట్ వ్యతిరేక సభకు బయలుదేరిన నాయకులు

వాంకిడి: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఫాసిస్ట్ వ్యతిరేక సభకు సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ నాయకులు ఆదివారం మండలం నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగర్ల తిరుపతి మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న ఫాసిస్ట్ విధానాన్ని రూపుమాపేందుకు ప్రత్యేక కార్యచరణతో సమావేశం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు రషీద్, దయాకర్, అశోక్, అనిల్, మల్లయ్య, అన్నాజీ, సదాశివ్, పెంటు తరలివెళ్లారు.

వారంలోగా పన్నులు వసూలు చేయాలి



రశీదులు పరిశీలిస్తున్న ఎంపీవో

కెరమెరి: వారంలోగా ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని ఎంపీవో ఎండీ అంజద్ పాషా అన్నారు. ఆదివారం మండలంలోని కెరమెరి, ఝరి, సుర్దాపూర్, రింగన్‌ఘాట్ గ్రామ పంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్ కింద చేపట్టిన పన్నుల వసూలు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఇంటి పన్నులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇప్పటికే మండలంలో 80 శాతం పన్నులు వసూలైనట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు భీమయ్య, జావెద్, సరిత తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సంబరాల్లో ఉద్యోగులు, నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో ఆదివారం ఆర్టీసీ ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వార్ల తిరుపతి, నాయకులు ఎమ్మాజీ సంతోశ్, వెంకటేశ్, అత్తర్, రమేశ్, ఆర్టీసీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన వైద్యుడు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని పాత ఉట్నూర్ చెందిన మెస్రం గీత బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతోంది. భార్య భర్తలు కూలీనాలి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గ్రామస్తులు తలకొంత నగదు జమ చేసి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. హైదరాబాద్ నిమ్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న నార్నూర్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ జాదవ్ నితిన్ కుమార్ వారి పరిస్థితిని గమనించాడు. తన సొంత ఖర్చులతో మెరుగైన వైద్యం అందించాడు. సహాయం చేసిన వైద్యుడిని పాత ఉట్నూర్ గ్రామస్తులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇందులో ఉట్నూర్ గ్రామపటేల్ ఆత్రం లక్ష్మణ్, దేవరీ మడావి లక్ష్మణ్, కుర్సెంగ మోతీరాం, మల్కు పాల్గొన్నారు.

చెరుకు రసం తాగుతున్న ప్రజలు



చెరుకు పంట



చెరుకు రసంతో 'తియ్యని' ఉపాధి

- నెలకు రూ.45 వేలకు పైగా ఆదాయం
- సాగుతో అధిక లాభాలు
- ఆదర్శంగా నిలుస్తున్న శంకర్, ముక్రంలు

కెరమెరి: ఎందరో యువకులు ఉన్నత చదువులు చదివి.. సరైన ఉద్యోగం లేక.. వ్యాపారం చేద్దామంటే ఆర్థిక స్థోమత సరిపోక కుంగిపోతుంటారు. కానీ మండలానికి చెందిన శంకర్, మహమ్మద్ ముక్రంలు చెరుకు రసం విక్రయిస్తూ వేల రూపాయలు సంపాదిస్తున్నారు. ఎందరో యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

నెలకు రూ.45 వేలు ఆదాయం

గోయగాం గ్రామ సమీపంలో శంకర్ ఎకరంలో చెరుకు పంట వేశాడు. తొమ్మిది మాసాల్లో చేతికొచ్చిన చెరుకు పంటతో చెరుకు రసం వ్యాపారం చేద్దామనుకున్నాడు. అదేతడవుగా రసం తీసే మిషన్‌తో పాటు జనరేటర్‌ను కొనుగోలు చేసి వ్యాపారం ప్రారంభించాడు.. 2021లో జనరేటర్, చెరుకు తీసే యంత్రం, ఫ్రిజ్‌కు రూ.లక్షా20 వేలు ఖర్చు చేశాడు. అన్ని ఖర్చులు పోనూ రోజుకు రూ.1500 వరకు ఆదాయం వస్తుందని శంకర్ చెబుతున్నాడు. ఆ తర్వాత ఇప్పటి వరకు రూపాయి ఖర్చు లేదు. చెరుకు సాగుకు మొదటి ఏడాది రూ.45 వేలు ఖర్చు చేశాడు. ఒక్కసారి పంట వేస్తే మూడేళ్ల వరకు చెరుకు పంట దిగుబడినిస్తుంది.

మహారాష్ట్ర నుంచి వచ్చి..

ధనోరా గ్రామంలో నివసిస్తున్న ఎండీ ముక్రం ఎనిమిదేళ్ల క్రితం మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా అహ్మద్‌పూర్ (శివన్‌ఖేడ్) నుంచి మండలంలోని ధనోరా గ్రామానికి వలసవచ్చి రూ.2 లక్షలకు 17 ఎకరాల సాగు భూమి లీజుకు తీసుకున్నాడు. అందులో ఎకరంలో చెరుకు పంట సాగు చేయగా మిగిలిన భూమిలో కూరగాయలు, ఆకుకూరలు, పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, టమాట సాగు చేస్తున్నాడు. కొన్నేళ్లుగా చెరుకు రసంతో అన్ని ఖర్చులు పోనూ ప్రతీరోజు రూ.2000 వరకు సంపాదించగలుగుతున్నాడు.

రసం తాగుతుండగా వచ్చిన ఆలోచన..



నాలుగేళ్ల క్రితం కాగజ్‌నగర్‌కు వెళ్తుండగా ఓ చోట ఆగి చెరుకు రసం తాగాను. అక్కడే రసం తయారుదాడిని చెరుకు రసం తయారీ పద్ధతులు, అయ్యే ఖర్చులపై ఆరా తీశాను. ఆ ఏడాదే కిలో చెరుకుకు రూ.10 చెల్లించి రసం తయారు చేసి విక్రయించాను. తర్వాత నుంచి నేనే చెరుకు సాగు చేసి వ్యాపారం చేస్తున్నాను. ఇప్పుడు మళ్లీ ఐదు ఎకరాల్లో చెరుకు సాగు చేస్తున్నా. నెలకు రూ.45 వేలు సంపాదిస్తున్నాను.

– నికోడే శంకర్, గోయగాం

తక్కువ ఖర్చు.. ఎక్కువ లాభం



చెరుకు సాగుకు తక్కువ ఖర్చు వస్తుంది. ఒక ఏడాది ఖర్చు చేస్తే మూడేళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. మొదటి ఏడాది నీరు, ఎరువులు, కలుపు కూలీలకు మొత్తంగా ఎకరానికి రూ. 50 వేల వరకు ఖర్చు వస్తుంది. తర్వాత ఏడాది నుంచి ఎలాంటి ఖర్చు లేకుండా మూడేళ్ల పంట తీయవచ్చు. చెరుకు గడలను విక్రయించడంతో పాటు చెరుకు రసం కూడా తయారు చేయవచ్చు. ఎక్కువ పంట సాగు చేస్తే బెల్లం కూడా తయారు చేయవచ్చు.

– మహమ్మద్ ముక్రం, ధనోరా

ట్రాక్టర్లకు రక్షణ కరువు

- అటవీ భూముల్లో సాగు చేస్తున్నారని సీజ్
- ఏళ్లు గడుస్తున్నా వదిలేయని వైనం
- మాయమవుతున్న విడిభాగాలు
- కిస్తీలు కట్టలేక యజమానులు సతమతం



సీజ్ చేసిన ట్రాక్టర్లు

బెజ్జూర్: అటవీశాఖకు సంబంధించిన భూముల్లో సాగు చేస్తున్నారని సీజ్ చేసి అటవీశాఖ కార్యాలయానికి తరలించిన ట్రాక్టర్లకు రక్షణ కరువైంది. ఏళ్లుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండడంతో ట్రాక్టర్లు తుప్పు పట్టిపోతున్నాయి. మరోవైపు ట్రాక్టర్లకు సంబంధించిన విడిభాగాలు మాయమవుతుండడంతో ట్రాక్టర్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. మొత్తంగా ఎనిమిది ట్రాక్టర్లను సీజ్ చేయగా, రాజకీయ ఒత్తిళ్లతో మూడు ట్రాక్టర్లను విడుదల చేశారు. మిగితా ట్రాక్టర్లను మాత్రం కక్ష సాధింపులో భాగంగా విడుదల చేయడం లేదని ట్రాక్టర్ల యజమానులు ఆరోపిస్తున్నారు.

2016లో సీజ్..

అటవీశాఖ భూముల్లో సాగు చేస్తున్నారనే నెపంతో 2016 జూన్‌లో బెజ్జూర్ రేంజ్ పరిధిలోని చిన్నసిద్దాపూర్, పాపన్‌పేట్, ఊట్‌సారంగపల్లి, డబ్బాగూడ, సులుగుపల్లి గ్రామాలకు చెందిన ఎనిమిది ట్రాక్టర్లను అప్పటి అటవీ శాఖ అధికారులు సీజ్ చేసి బెజ్జూర్ రేంజ్‌లోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. అప్పటి నుంచి ట్రాక్టర్లు అక్కడే తుప్పు పడుతున్నాయి. వీటితో అటవీ భూముల్లో సాగు చేస్తున్న ట్రాక్టర్ యజమానులపై కేసులు కూడా నమోదు చేశారు. కాగా ట్రాక్టర్లపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదని, దానికి సంబంధించిన ఆధారాలను సైతం అధికారులు చూపడం లేదని యజమానులు ఆరోపిస్తున్నారు. అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో మూడు ట్రాక్టర్లను నామమాత్రపు జరిమానాతో వదిలేయగా, మిగితా ఐదు ట్రాక్టర్లు నేటికీ రేంజ్ కార్యాలయంలోనే ఉన్నాయి. ట్రాక్టర్ యజమానులు జరిమానా చెల్లిస్తామని చెబుతున్నా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

బెజ్జూర్ రేంజ్ పరిధిలోనే..

బెజ్జూర్ రేంజ్ పరిధిలోని చిన్నసిద్దాపూర్ గ్రామానికి చెందిన సిండే సావిత్రాబాయి, సిండే చిన్నక్క, టాకిరే అమ్మక్కకు 6వ విడత భూ పంపిణీలో అప్పటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. సంబంధిత రైతులు ఆయా భూముల్లో ట్రాక్టర్లతో సాగు చేసుకుంటున్న సమయంలో అటవీ శాఖ అధికారులు, పోలీసు బందోబస్తు మధ్య ట్రాక్టర్లను సీజ్ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల్లో సాగు చేసుకుంటున్నా ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నారని రైతులకు, అటవీ శాఖ అధికారులకు తీవ్ర వాగ్వాదం కూడా జరిగింది. అయినా అటవీశాఖ అధికారులు ట్రాక్టర్లను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించారు. తమ ట్రాక్టర్లను వదిలేయాలని అటవీ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదని యజమానులు వాపోతున్నారు. ట్రాక్టర్లు లేక వాటి కిస్తీలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. అయితే కేసులు నమోదు కావడంతో ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మూడు ట్రాక్టర్లు విడుదల..

మొత్తం ఎనిమిది ట్రాక్టర్లను సీజ్ చేసిన అధికారులు మూడింటిని కేవలం నామమాత్రపు జరిమానాతో వదిలేశారు. దీంతో అప్పట్లో అటవీ శాఖ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి. మిగితా ట్రాక్టర్ల యజమానులపై కక్ష సాధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. మరోవైపు రేంజ్ కార్యాలయానికి తరలించిన ట్రాక్టర్లను పట్టించుకోక పోవడంతో విలువైన పార్ట్స్ మాయమవుతున్నాయని యజమానులు వాపోతున్నారు. ట్రాక్టర్లకు సంబంధించిన టైర్లు, డెక్స్‌లు, సీట్లతో పాటు ఇతర విలువైన పరికరాలు మాయం కావడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి జరిమానాలతో ట్రాక్టర్లను విడుదల చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్‌ను వివరణ కోరగా, ట్రాక్టర్ల కేసు పీఓఆర్ అయితే కోర్టు ద్వారానే ట్రాక్టర్లను తీసుకెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.

సీసీరోడ్లతో గ్రామాలకు మహర్దశ



భూమిపూజ చేస్తున్న శ్రీనివాస్



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

దహెగాం: గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో మహర్దశ వస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు, గొర్రెగుట్ట ఇట్యాల గ్రామాల్లో ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామాలకు మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. గొర్రెగుట్టలో రూ.11 లక్షలతో మూడు సీసీ రోడ్లు, కోత్మీర్‌లో రూ.10 లక్షలతో రెండు, మండల కేంద్రంలో రూ.15 లక్షలతో మూడు సీసీ రోడ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కొండ్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు రమేశ్, నాయకులు సామెర మల్లేశ్, మహేశ్, సిద్దం వెంకటేశ్, సుధాకర్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డుకు భూమిపూజ

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామస్తుల సౌకర్యం కోసం సీసీరోడ్డు వేస్తున్నామని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మండలంలోని రౌట సంకెపల్లి జీపీలోని పర్సనంబాల గ్రామంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్పసభ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న యెలగతి సుచిత్

వాంకిడి: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ నెల 12న నిర్వహించే విజయ సంకల్పసభను జయప్రదం చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యెలగతి సుచిత్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయిగోపాల పాఠశాల ఆవరణలో పార్టీ నాయకులతో మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, రానున్న ఎంపీ ఎన్నికల్లో భారీ విజయం సాధించి మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చీడర్ల నరేశ్, మాసగోని సాగర్, మండోకార్ వికాస్, వేణు, వెంకటయ్య, ప్రశాంత్, శ్రీకాంత్, సాయి, నాగరాజు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

చౌపన్‌గూడలో మహిళల 2కే రన్



ప్రశంసా పత్రాలతో మహిళలు

కెరమెరి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో శ్రీ చైతన్య యువజన సంఘం, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి మెయిన్ రోడ్డు వరకు 2కే రన్ నిర్వహించారు. ఇందులో 15 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారు. విజేతలుగా సంగీత, భూమిక, భాగ్యశ్రీ నిలిచారు. వీరికి బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు మజీద్, వసంత్‌రావు, జంగు, మోతిరాం, అంబారావు, నాగోరావు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: సైనిక్ స్కూల్‌లో ప్రవేశం కోసం నిర్వహించిన సెట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్సీవో స్వరూపారాణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సాంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సైనిక్ స్కూల్ రుక్మాపూర్ సెట్ అర్హత పరీక్షకు 6వ తరగతిలో 95 మందికి గాను 84 మంది హాజరైనట్లు తెలిపారు. 11 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటర్ ఫస్టియర్ కోసం 60 మందికి గాను 48 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు.

కాలనీల అభివృద్ధికి కృషి

ఉట్నూర్‌రూరల్: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర కాలనీలో పొద్దు పొడుపు.. బొజ్జన్న అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది, కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీరు, రోడ్డు, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లాజర్, సలీం, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి వర్ధంతి



వాంకిడి: సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

లింగాపూర్: మండలకేంద్రంలోని రమాబాయి మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమె ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండల కేంద్రంలో ఆదివారం మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మాలి సంక్షేమ సంఘ భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు వాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల్లోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమె పోరాటం ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులె నారాయణ, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు గుర్నులె మెంగాజీ, మండల అధ్యక్షుడు వడై బాబురావు, నాయకులు బెండరె దివాకర్, సెండె సుధాకర్, మొహర్లె అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో ఆదివారం సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాఫర్, తిరుపతి, లక్ష్మణ్, సందీప్, హన్మంతు, దేవేందర్, మాలీ సంఘం మండల కమిటీ అధ్యక్షుడు కావ్‌డే తుల్సిరాం, నాయకులు సెండే నారాయణ, దేవేందర్, తిరుపతి, గణపతి, ఒసామా, తదితరులు ఉన్నారు.



కెరమెరి: నివాళులర్పిస్తున్న నాయకులు



కౌటాల: పూలమాలలు వేస్తున్న నాయకులు

సావిత్రీబాయి ఆశయాల సాధనకు కృషి

కౌటాల: సావిత్రీబాయి పూలే ఆశయాల సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, ఆమె అడుగు జాడల్లో నడవాలని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్ అన్నారు. సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని సంఘం భవనంలో సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. మండలంలోని ముత్తంపేట్, కన్నెపల్లి, నాగేపల్లి గ్రామాల్లో మాలి కులస్తులు వర్ధంతి నిర్వహించారు. వేడుకల్లో సంఘం మండలాధ్యక్షుడు నికోడే గంగారాం, సంఘం నాయకులు ఆదే చందు, ప్రసాద్, పాండురంగ్, నారాయణ, మధుకర్, శంకర్, వెంకటి, రాజు, ప్రవీణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటిపై నివేదిక ఇవ్వండి'

నార్నూర్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో తాగునీటి సౌకర్యం లేక రోగులు ఇబ్బంది పడుతున్న వైనాన్ని సాక్షి దినపత్రికలో శుక్రవారం 'సీహెచ్‌సీలో తాగునీటి కటకట' అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో కలెక్టర్ రాజర్షిషా స్పందించారు. సీహెచ్‌సీ సమస్యలపై ఆరా తీశారు. సీహెచ్‌సీలో తాగునీటి సమస్యలపై పూర్తి నివేదికను అందజేయాలని సూపరింటెండెంట్ ఉపేందర్‌ను ఆదేశించారు. ఆదివారం సీహెచ్‌సీను సందర్శించి, ఆస్పత్రికి నీటిని వాడుతున్న సంపును పరిశీలించారు. తాగునీటి సౌకర్యం కల్పించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు తాగు నీటి అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఆదిలాబాద్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్‌లో గత కొద్ది రోజులుగా జరుగుతున్న వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీ అందజేశారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామీణస్థాయి క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలన్నారు. కబడ్డీలో మొదటి బహుమతి చిన్నమాలి బోరిగం, రెండో బహుమతి టెక్కి గూడ జట్టు గెలిపొందాయి. వాలీబాల్‌లో మొదటి బహుమతి మత్తడి గూడ గ్రామం, రెండో బహుమతి తలమడుగు మండలం పల్లి(కె) జట్లు గెలుచుకున్నాయి. గోవర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్ నాయకులు పాల్గొన్నారు

కరపత్రాలు ఆవిష్కరణ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఈనెల 13, 14న నిర్వహించే పరమ హంస సద్గురు పూలాజీ బాబా ధాన్య మందిర 18వ వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేతుల మీదుగా విడుదల చేశారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలి

ఉట్నూర్‌రూరల్: ఏసీ గదుల్లో పని చేసే ఉద్యోగులకు ప్రభుత్వం 1వ తారీఖున వేతనాలు ఇస్తూ, రైతులను పట్టించుకోవడం లేదని వ్యాఖ్యలు చేసిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలని పీఆర్టీయు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హరీశ్ రావు వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి జాదవ్ సంజయ్‌కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జాదవ్ గోవిందలు మాట్లాడుతూ.. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వక 20 తేదీ దాటిన తరువాత వేతనాలు ఇచ్చిందని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో కనీసం పీఆర్సీ పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయుల ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, ఇతర బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరారు.